లానేస్తం మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్

95 మందికి 'వైఎస్సార్ లా నేస్తం'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2023-24 సంవత్సరానికి రెండో విడతగా వైఎస్సార్ లా నేస్తం పథకం కింద జిల్లాలో అర్హులైన 95 మందికి రూ.26.80 లక్షలు సాయం అందించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి లా నేస్తం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ మంజుల, నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, డీఎల్డీవో ఓబులమ్మ, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023-24 సంవత్సరానికి రెండో విడతగా వైఎస్సార్ లా నేస్తం పథకం కింద 95 మంది లబ్ధిదారులకు రూ.26.80 లక్షలు లబ్ధి కలగడం జరిగిందన్నారు. యువ న్యాయవాదులకు తొలి మూడు సంవత్సరాలు అండగా ఉంటూ, వారికి ఊతమిస్తూ వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో 95 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు 5,000 రూపాయల స్టైఫండ్ చొప్పున జూలై, డిసెంబర్ -2023 (6నెలలు)కు సంబంధించి ఒక్కొక్కరికి 30 వేల రూపాయలు చొప్పున రూ.26.80 లక్షల లబ్ధిని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జమ చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ లా నేస్తం పథకం కింద రాష్ట్రంలో కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వానికి సాయం అందిస్తోందన్నారు. అనంతరం లానేస్తం మెగా చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కేంద్ర కరువు బృందం కరుణించేనా ?

నేడు, రేపు అనంత, సత్యసాయి జిల్లాల్లో పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందాలు ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేయనున్నాయి. సోమవారం రాత్రికే అనంతపురం చేరుకున్న బృందాలు మంగళ, బుధవారాల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాలో పర్యటించనున్నాయి. బృందం సభ్యులు వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించనునన్నారు. ఇప్పటికే బృందాల పర్యటనకు సంబందించి రూట్ మ్యాప్‌లు ఖరారయ్యాయి. కేంద్ర బృందం తొలిరోజు మంగళవారం నాడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్ నేతృత్వంలో కరువు బృందం కరువు పరిశీలన చేయనుంది. పదిమంది సభ్యులు ఈ బృందంలో ఉన్నారు. మూడు బృందాలుగా విడిపోయి ఈ బృందం పర్యటన చేయనున్నట్టు సమాచారం.

కేంద్ర కరువు బృందం కనికరించేనా ?

కరువు ప్రకటనలు వెలువడిన ప్రతిసారీ బృందాలు పర్యటించడం, వెళ్లడం సర్వసాధారణమైన అంశంగా ఉంటోంది. సాయం మాత్రం నామమాత్రంగానే ఉంటోందన్న విమర్శ ఉంది. ఈసారి పర్యటించే బృందం ఏ మేరకు కరుణిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు చూసుకున్నా వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో 36 శాతం వర్షపాతం లోటుండగా, సత్యసాయి జిల్లాలో 30 శాతం వర్షపాతం లోటుంది. ప్రధానంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం జులై, ఆగస్టు మాసాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు అనంతపురం జిల్లాలో నెలకొన్నాయి. వంద ఏళ్లలో ఎప్పుడూ లేనంత తక్కువ వర్షపాతం ఈసారి ఆగస్టులో నెలకొంది. సాధారణ వర్షపాతం ఆగస్టు నెలలో 83.3 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 13.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 83.7 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. వందేళ్లలో ఇంత తక్కువ వర్షపాతం ఆగస్టులో నమోదవడం ఇదే ప్రథమం. ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన ఆగస్టులో వర్షభావం మూలంగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. వేసిన పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి.

కేంద్ర బృందం పర్యటనపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం జిల్లా సాధారణ సాగు 9.66 లక్షల ఎకరాలకుగానూ 6.34 లక్షల ఎకరాల్లోనే సాగైంది. సాధారణ సాగులో ఇది 67 శాతమే కావడం గమనార్హం. సత్యసాయి జిల్లాలో మరింత తక్కువ సాగైంది. 7.12 లక్షల ఎకరాలకుగానూ 2.58 లక్షల ఎకరాల్లోనే విత్తనం పడింది. అంటే సాధారణ సాగులో 35 శాతమే పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధాన పంట వేరుశనగ పూర్తిగా దెబ్బతింది. అనంతపురం జిల్లాలో 2.28 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవగా, సత్యసాయి జిల్లాలో కేవలం 1.77 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఈ పంట సాగుకు ఎకరానికి రూ.40 వేల వరకు ఖర్చు రాగా రైతుకు దక్కిన ప్రతిఫలం రెండు బస్తాల విత్తనకాయలు కూడా రాలేదు. దీంతో పూర్తిగా రైతులు నష్టపోయి ఉన్నారు. పత్తి ఆముదం తదితర పంటల పరిస్థితి కూడా ఇదే తీరుగా ఉంది.

ఇప్పటికే అంచనాలు

పంటనష్టంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను రూపొందించింది. అనంతపురం జిల్లాలో రూ.251 కోట్లు నష్టం వాటిల్లినట్టు అంచనాలు రూపొందించి రాష్ట్రప్రభుత్వానికి నివేదించింది. ఇవి కాకుండా తాగునీటి కష్టాలు, కరువు సమయాల్లో వలసలు పోకుండా ఆదుకునే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వీటన్నింటికీ ఎన్ని నిధులు అవసరమవుతాయన్న ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగం కరువు బృందం ముందు ప్రతిపాదించేందుక సిద్ధమైంది. నేడు జల్లా కలెక్టరేట్‌లో ఉదయం జరిగే సమీక్షల్లో కరువు బృందం ముందు అధికారులు ప్రతిపాదించనున్నారు.

'ప్రభుత్వంపై అసంతృప్తి లేదు..!

◆టీచర్ మల్లేష్ కుటుంబ సభ్యుల వివరణ

◆ఆయన మానసికస్థితి బాగోలేదు : సిఐ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సిపిఎస్ రద్దు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులకిచ్చిన మాట తప్పారంటూ మల్లేష్ అనే ఉపాధ్యాయుడు ఆదివారం నాడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ విషయంపై సోమవారం నాటికి కుటుంబ సభ్యులు ఈ విషయంపై మాట మార్చారు. భార్య శివలక్ష్మి, బావ ఆదినారాయణలు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం పట్ల తమకు ఎలాంటి అసంతృప్తి లేదని శివలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రాసిన లేఖ కూడా ఎందుకు రాసారో తెలియదని ఆమె చెప్పారు. రాజకీయాల కోసం దీన్ని వాడుకోవద్దని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఉరవకొండ అర్బన్ సిఐ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మల్లేష్ ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపామని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణం ఆయన మానసిక పరిస్థితి సరిగాలేకనే అని చెప్పారు. వివిధ బ్యాంకులు, ప్రయివేటు సంస్థల్లో రూ.26 లక్షల వరకు అప్పులు చేశారన్నారు. ఈ అప్పుల భారంతో మానసిక పరిస్థితి సరిగాలేకనే ఈ ప్రయత్నం చేసినట్టు తమ విచారణలో తెలిసిందని చెప్పారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పందనలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రి దేవి, ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 335 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఆయా శాఖల అధికారులు దీనిపై ప్రత్యేక దష్టి సారించి అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. పెండింగ్ ఉన్న అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోండి

జేసీ కేతన్‌గార్గ్‌కు సిపిఎం విన్నపం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రజల ఆరోగ్య సంరక్షణ- ప్రభుత్వ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో సిపిఎం బృందం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలపై వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మేధావులతో సిపిఎం జిల్లా కమిటీ చర్చావేదిక నిర్వహించిందన్నారు. ఇందులో పలు తీర్మానాలు చేశారని తెలిపారు. జిల్లా ప్రజారోగ్యం సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పడకల సంఖ్యను 1500కు పెంచాలన్నారు. అందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలన్నారు. అన్ని వైద్య శాఖల్లో పీజీ సీట్లు అమలు చేయాలన్నారు. జిల్లా సర్వజనాసుపత్రిలో ఆరోగ్యశ్రీ ఆపరేషన్‌లు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుని, అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించాలన్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయి పరిపాలన అధికారిని నియమించాలన్నారు. క్యాన్సర్ ఆసుపత్రిలో టెలికోబాల్ట్ మిషన్ రెన్యూవల్ చేసి, రేడియోథెరపీ ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ వైద్యుల ప్రయివేటు ప్రాక్టీస్‌లను నిషేధించాలన్నారు. ప్రభుత్వ వైద్యుల, సిబ్బంది జీతభత్యాలను, పని పరిస్థితులను మెరుగు చేయాలన్నారు. వైద్య రంగంలో కాంట్రాక్ట్ నియామకాలు కాకుండా, రెగ్యులర్ నియామకాలు చేపట్టాలన్నారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో భాగంగా నిర్మిస్తామన్న అధునాతన, తల్లీపిల్లల ఆసుపత్రిని నిర్మించడానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కాంప్రహెన్సీ ప్రైమరీ హెల్త్ కేర్ అప్రోచ్‌ను మెరుగుపచడానికి ఒక ఫంక్షనల్ రెఫెరల్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని కోరారు. సబ్ సెంటర్‌లు, పిహెచ్‌సిలను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. 2500 జనాభాకు ఒక హెల్త్ విల్‌నెస్ సెంటర్‌ను పూర్తి సిబ్బందితో, వనరులతో పని చేయించాలని విన్నవించారు. పీహెచ్‌సీలలో కంప్యూటర్ ఆపరేటర్‌లు, డేటా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. సిహెచ్‌సి, ఎహెచ్‌సిలలో మినీ ఐసియులను ఏర్పాటు చేయాలన్నారు. గుండెపోటు వచ్చిన వారికి, అత్యవసర ఇంజక్షన్ ఇచ్చి, రెఫర్ చేసే అవకాశం ఉండాలన్నారు. సిహెచ్‌సి, ఎహెచ్‌లలో స్పెషలిస్టులను (జనరల్ ఫిజిషియన్ గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్, ఆర్థోపిడిషియన్, జనరల్ సర్జన్, అనస్థటిస్ట్‌లను నియమించాలన్నారు. మున్సిపల్ పట్టణాలు, నియోజకవర్గం కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలలో అన్ని స్థాయిలలో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో వసూళ్లు చేస్తున్న ఫీజులను హేతుబద్ధంగా ఉండేటట్టు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంచినీళ్లు, టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి దగ్గర రోగుల సేవలకులకు ఉచిత భోజన క్యాంటీన్‌లను ప్రభుత్వం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ముస్కిన్ తదితరులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎస్ రద్దు హామీని అమలు చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని తక్షణం అమలు చేసి మాట నిలుపుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిపిఎస్ రద్దు ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు చెల్లించాలన్నారు. ఉరవకొండకు చెందిన ఉపాధ్యాయుడు మల్లేష్ ఆత్మహత్యాయత్నం ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వైఎస్ఆర్‌సిపి ఇచ్చిన హామీల్లో భాగంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఈ హామీ అమలు కాకపోవడంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమించారని గుర్తుచేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తోందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ చేత ఉపాధ్యాయుల మీద తీవ్రమైన కక్షసాధింపులకు పాల్పడడం దుర్మార్గమైన చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వైసిపి గెలవాలని బలంగా భావించిన ఉద్యోగ, కార్మికులు నేడు తీవ్ర వ్యతిరేకతతో ఉన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరించే ఏ ప్రభుత్వాన్ని అయినా ప్రజలు సహించరని తెలిపారు. ఇప్పటికైనా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఉపాధ్యాయుడు మల్లేష్ కు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను కోరారు.

కేక్ కోసం సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

'యువగళం' ఓ చరిత్ర : టిడిపి

అనంతపురం కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్ల మైలురాయి చేరుకోవడం హర్షణీయంగా ఉందని మాజీ కార్పొరేటర్ పరిమి రాజారావు అన్నారు. సోమవారం 35వ డివిజన్‌లో టిడిపి ఆధ్వర్యంలో నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ప్రజలతో కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రాజారావు మాట్లాడుతూ 219 రోజులుగా యువగళం పాదయాత్రకు ప్రజలు, యువత విశేషంగా ఆదరిస్తున్నారని తెలిపారు. ప్రజలు, యువత, రైతులు, కార్మికుల సమస్యలు స్వీకరిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా కలిసికట్టుగా ప్రజలు పని చేయడానికి సిద్ధమయ్యారని తెలిపారు.

నేటి నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

మండల కార్యాలయాల వద్ద ఆందోళన - కనీస వేతనాలు, గ్రాట్యుటీ సాధనే లక్ష్యంగా పోరాటం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తమ న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం అంగన్‌వాడీలు నేటి నుంచి సమ్మెబాట పట్టారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచే అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడనున్నాయి. ఇది వరకే సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ ఎం.గౌతమి, మంత్రి ఉషాశ్రీచరణ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. స్పందించిన మంత్రి ఈనెల 12న యూనియన్ నేతలను చర్చలకు ఆహ్వానించారు. చర్చలు సఫలవంతం కాకపోవడంతో సమ్మెలోకి వెళున్నట్లు యూనియన్ నేతలు ప్రకటించారు. అంగన్‌వాడీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందజేయడం, శాంతియుత నిరసనలు, ధర్నాలు అనేక రూపాల్లో హక్కుల కోసం పోరాటాలు కొనసాగించింది. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, కనీస వేతనాలు పెంపుదల చేయాలని, 6 నెలల నుంచి బకాయిబడ్డ సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయాల పదోన్నతలు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంపుదల, రాజకీయ జోక్యాన్ని నివారించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు, సర్వీసులో ఉండి మృతిచెందిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం, బీమా అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలనె ప్రధాన డిమాండ్‌లు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రభుత్వం సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నేతలతో నిర్వహించిన చర్చల్లో ఖచ్చితమైన హామీలు ఇవ్వకపోవడంతో నిరవధిక సమ్మెలోకి అంగన్‌వాడీలు వెళ్లారు.

సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే..

సిఎం జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికల్లో అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.13,650 చెల్లిస్తోంది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం రూ.11,500 చెల్లిస్తోంది. ఆయాలకు రూ. 7వేలు మాత్రమే చెల్లిస్తోంది. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాల కోత విధించింది. వేతనాలు చెల్లింపులో మాత్రం అంగన్‌వాడీలు ప్రభుత్వానికి సంబంధం లేదంటూ ధ్వంవ వైఖరి ప్రదర్శిస్తోంది. పిల్లలకు, బాలింతలకు నాణ్యతలేని బాలామతం, గుడ్లు, చిక్కీలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం మానేసి, విజిట్ల పేరుతో ఫుడ్ కమిషనర్, అధికారులు అంగన్వాడీలను వేధిస్తున్నారు. అనేక సమస్యలు ప్రభుత్వానికి విన్నవించిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికే నిరవదిక సమ్మెలోకి వెళుతున్నాం. ఇప్పటికైనా అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం స్పందించాలి.

- ఎస్.నాగేంద్రకుమార్,
ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు,
- రమాదేవి, జిల్లా ప్రదాన కార్యదర్శి

14, 15న కలెక్టరేట్ ఎదుట ఆశాల' వంటావార్పు

ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆశా కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14, 15 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 36 గంటల వంటా వార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి తెలిపారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో వంటావార్పు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కింది స్థాయి వరకు వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆశా వర్కర్లు సమస్యలును ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఆశలపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా 60 సంవత్సరాలు దాటిన తర్వాత వట్టి చేత్తో ఇళ్లకు పంపుతున్నారని విమర్శించారు. ప్రమాదంలో ఆశాలు మృతి చెందితే ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా ఇవ్వటం లేదన్నారు. కుటుంబానికి భద్రత చూపించడం లేదన్నారు. ఆశా వర్కర్లకు సెలవులు లేవు అనే నెపంతో కక్ష సాధింపుకు పాల్పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో పని చేస్తున్న ఆశావర్కర్లకు సరైన భద్రత సదుపాయాలు కల్పించకుండా, ప్రభుత్వ ఉద్యోగులు అనే నెపంతో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం కలెక్టర్ కార్యాలయం దగ్గర 14, 15 తేదీల్లో చేపడుతున్న వంటావార్పును ఆశాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆశావర్కర్ యూనియన్ నాయకులు మాలతి, అనూరాధ, సమంత, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, చంద్రశేఖర్, చంద్ర, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు

సేవా సుప్రీమ్, ఎస్ఎస్ఆర్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న సేవా సుప్రీం, ఎస్ఎస్ఆర్ ఏజెన్సీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు వేతనాలు ఇవ్వాలని యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే వేతనాలు ఇవ్వకపోగా ఉద్యోగాలు తొలగిస్తామన్న రీతిలో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వేతనాలు రాకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. తక్షణమే కార్మికులకు వేతనాలు చెల్లించి సేవా సుప్రీం, ఎస్ఎస్ఆర్ సంస్థ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు బండారి శంకర్ పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

గుంతల రోడ్డులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

పుట్లూరు : మండలంలోని కొండాపురం నుంచి తిమ్మంపల్లి వెళ్లే రహదారిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని కొండాపురం నుంచి తిమ్మంపల్లి వెళ్లే రహదారి మధ్యలో సూరేపల్లిలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద, పెద్ద గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే చాలామంది గోతుల్లో పడి గాయాలపాలయ్యారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సూరి, నాయకులు వెంకట్‌చౌదరి, భాస్కర్, పెద్దయ్య, వెంకటరమణ, చంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప

సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప తెలిపారు. సోమవారం పట్టణంలోని 30వ వార్డుకు సంబంధించిన 17వ సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక వార్డు సభ్యులు గోరంట్ల ఉషతో కలిసి సంక్షేమ పథకాల వివరాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ఆరోగ్య సురక్ష, నాడు-నేడుతో పాఠశాలల మార్పు వంటి ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

భంభం స్వామి లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని భంభం స్వామి లేఅవుట్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ప్రాతినిథ్యం వహిస్తున్న భంభంస్వామి కాలనీలో తాగునీటి ఎద్దడి, మురికి కాలువలు, వీధి దీపాలు వంటి సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధుల్లో మురికి నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఆయా సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని, లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆలయ ఆధునీకరణ పనులకు విరాళం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విరాళం అందజేస్తున్న బెస్తరపల్లి జికె కృష్ణమూర్తి

కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామంలో వెలసిన పురాతన సవారమ్మ ఆలయం ఆదునీకరణ పనులకు బడుగు, బలహీన వర్గాల నేత బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి సోమవారం విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు సాయం చేయాలని గ్రామ పెద్దలు కోరగా స్పందించిన ఆయన రూ.5,00,116 అందజేశారు. ఆయన ఇప్పటికే గ్రామంలో శుద్ధిజల ప్లాంటు ఏర్పాటుకు సాయం అందించారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనులకు కూడా విరాళం అందించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అక్కమ్మ దేవాలయం వద్ద అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో అఖండ జ్యోతి ఉయ్యాల ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే అన్నదానానికి రూ.10వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సెవెన్‌సోరో రేస్ కంపెనీ డైరెక్టర్ జయసింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గన్ ఫైర్ చేస్తున్న పోలీసులు

అనారోగ్యంతో మృతిచెందిన ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతదేహానికి సోమవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సోమందేపల్లి మండలం నాగనాయనిచెరువు తండాకు చెందిన శ్రీరామ్‌నాయక్ 1996లో ఏఆర్ పోలీసు విభాగంలో కానిస్టేబుల్‌గా చేరారు. ఈనేపథ్యంలో తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయనకు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అయినా పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈయన అంత్యక్రియలను స్వగ్రమంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పోలీసు అధికారుల సంఘం జిల్లా అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులునాయుడు, మృతుని బంధువులు, బ్యాచ్‌మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

12, 13న ఆర్టీసీ డిపోల వద్ద ధర్నా

రాయదుర్గం : ఈనెల 12, 13వ తేదీల్లో రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ, నేషనల్ మజ్దూర్ యూనియన్ అథారిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఆర్టీసీ డిపోల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎన్‌ఎంయుఎ రాయదుర్గం డిపో కార్యదర్శి తిప్పేస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. కావున డిపోలో ఉన్న ఎన్‌ఎంయుఏ రాష్ట్ర, జోనల్, రీజినల్, డిపో స్థాయి నాయకులు, లేట్ అవర్స్ డ్యూటీలో ఉన్న ఉద్యోగులు, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి


కమిషనర్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ మునిశేఖర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 49వ డివిజన్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మికి కార్పొరేటర్ మునిశేఖర్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో వీధి కుక్కలు విపరీతంగా సంచరిస్తూ పసి పిల్లలపై దాడులు చేస్తున్నాయన్నారు. వీధుల్లో వెళ్లే వాహనదారులను వెంట పడి గాయపరుస్తున్నాయన్నారు. వెంటనే వీధి కుక్కల బెడద తప్పించాలని కోరారు. అలాగే స్పీడ్ బ్రేకర్లు లేనందున వాహనదారులు విపరీతమైన వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు చేయాలని కోరారు.

సికిందర్ ఆశయాలు కొనసాగిద్దాం

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సికిందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పేదలు, రైతులు, కార్మికులు బాగుపడాలని ఆకాంక్షిస్తూ సిపిఎం పోరాటాల్లో తన వంతు పాత్ర పోషించిన సికిందర్ ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నాయకుడు సికిందర్ 4వ వర్ధంతిని పురస్కరించుకుని నీలిమా సర్కిల్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ సిపిఎం నిర్వహించిన పోరాటాల్లో సికిందర్ తనదైన పాత్ర పోషించాడని కొనియాడారు. పేద కుటుంబం నుంచి వచ్చి కష్టాలలో ఉన్న కార్మికులను, పేదలను ఆదుకోవడంలో ముందుండేవారిని, నమ్మిన ఆశయాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించేవాడన్నారు. పార్టీ పట్ల విశ్వాసం, విధేయత చూపేవారని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర రోగులు, వారి సేవలకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాల రంగయ్య, సిపిఎం జిల్లా కమిటీ నాయకులు ముస్కిన్, నగర కమిటీ సభ్యులు వలీ, బాబు, మసూద్, గోపాల్, ముత్తుజా, వెంకటేశు, జీవా, ఇర్ఫాన్, ఎన్టీఆర్ సీనా, పక్రు, రామాంజి, ఫయాజ్, సికిందర్ తండ్రి ఇస్మాయిల్, కుటుంబ సభ్యులు అలీ, నారాయణపురం ఎంపీటీసీ హాజీ వలి, మస్తాన్, ఎస్కే మహమ్మద్, బాల, రాజా తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా టాప్ : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

బాధితులకు పోగొట్టుకుపోయిన సెల్‌ఫోన్లను అప్పజెప్పడంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 8వేల ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.71లక్షలు ఉంటుందన్నారు. ఫోన్లను చోరీ చేసిన నిందితులు రాష్ట్రంలోని 9 జిల్లాలతోపాటు కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లినా వదలకుండా రికవరీ చేశామన్నారు. ఇకపోతే సెల్‌ఫోన్ల దుకాణం నిర్వాహకులుగానీ, ఎవరైనా అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయొద్దన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో తమ కుటుంబ సభ్యులకు సీరియస్‌గా ఉందని, డబ్బు కోసం సెల్‌ను అమ్ముతున్నామని నమ్మబలికి ఫోన్లు అమ్ముతరన్నారు. ఇలాంటి వారు ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో ఎక్కువగా ఉంటారన్నారు. ఎవరైనా ఫోన్లు అమ్ముతున్నట్లు తెలిస్తే సమీపంలోని పోలీసుస్టేషన్‌లోగానీ, ఎస్పీ మొబైల్ ఫోన్ 94407 96800కుగానీ సమాచారం చేరవేయాలని కోరారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీస్ సైబర్ విభాగం సి.ఐ షేక్‌జాకీర్, సిబ్బందిని అభినందించడమే కాకుండా ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈద్గా స్థలాన్ని పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిములు

మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్‌లో ఉన్న ఈద్గాకు సంబంధించిన స్థలాన్ని పరిరక్షించాలని మన్నీ రోషన్ మసీదు కమిటీ కార్యదర్శి నబీరసూల్ కోరారు. ఈమేరకు గుత్తి ఆర్ఎస్ సూన్నీ రోషన్ మసీదు, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ మహబూబ్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డు పక్కన ఉన్న సర్వే నంబర్ 259లో ఈద్గా మైదానం పక్కన ఉన్న ఐదు సెంట్ల భూమిని 2008 అక్టోబర్ 10న మసీదు కమిటీ ద్వారా కొనుగోలు చేశామన్నారు. అయితే సంబంధిత స్థలాన్ని సుగుణమ్మకు విక్రయించగా తాము తెలుసుకుని రద్దు పరచారన్నారు. ప్రస్తుతం తమ స్థలంలో ఈద్గా కమిటీ ప్రహరీ నిర్మిస్తుండగా ఆ స్థలం తమదని సుగుణమ్మ కోడలు భారతి అడ్డుపడుతోందని వివరించారు. స్థలానికి సంబంధించి ఆధారాలు చూపించాలని కోరగా ఆమె పట్టించుకోకుండా పనులు అడుకుంటోందని తెలిపారు. విచారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సున్నీ రోషన్ మసీద్ కమిటీ సభ్యులు జీఎం.బాషా, జిలాన్, బషీర్, ఖాజాఖాన్, ఆయూబ్‌బాషా, మస్తాన్, ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో దాతల సహకారంతో సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు సుబ్బయ్య, మానుకింద రవి, కె.రామచంద్రారెడ్డి, ఆర్.ఓబులేసు, నాగమల్లారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కుందు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను తొలగించాలి

నార్పల : మండల కేంద్రంలోని చైతన్యకాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, సంజీవరాయుడు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం రాక

రాయదుర్గం రూరల్ : వర్షాభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం రాయదుర్గం మండలంలో మంగళవారం పర్యటించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న మధ్యాహ్నం వేపరాల చెరువు, హగరి నది, ఆవులదట్ల, జుంజురాంపల్లి మారెంపల్లి, బాగినాయకనహళ్లి, 74 ఉడేగోళం గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించిన తర్వాత మారంపల్లి, బొమ్మక్కపల్లి గ్రామ పరిధిలోని పొలాల్లో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు.

కళ్యాణదుర్గం : కరువును పరిశీలించేందుకు కళ్యాణదుర్గం ప్రాంతంలో మంగళవారం కరువు కేంద్ర బృందం పర్యటించనున్నట్లు ఎడి జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా పంట నష్టం, రైతుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కరువు బృందం రానున్నట్లు తెలిపారు.

నార్పలలో మాజీమంత్రి శైలజానాథ్ పర్యటన

నార్పల : మాజీమంత్రి సాకే శైలజానాథ్ సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి తరుపున వచ్చే ఎన్నికల్లో శైలజానాథ్ పోటీ చేస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో మండలంలో ఆయన పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనతోపాటు నాయకులు దాదాగాంధీ, ప్రతాపరెడ్డి, శింగనమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

మూతబడ్డ అన్న క్యాంటీన్ వద్ద సెల్ఫీ దిగుతున్న కాలవ శ్రీనివాసులు

పేదల కడుపు కొట్టిన వైసిపి

మూతబడ్డ అన్న క్యాంటీన్ వద్ద 'కాలవ' సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన పేదలకు అన్నం పెడితే వైసిపి అధికారంలోకి వచ్చాక క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా సోమవారం పట్టణంలో మూసేసిన అన్న క్యాంటీన్ వద్ద సోమవారం సెల్ఫీ దిగి ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 223 అన్న క్యాంటీన్లను ప్రారంభించి రూ.5కే పేదలకు అన్నం పెట్టారని గుర్తు చేశారు. ఆయా క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.29కోట్ల మందికి ఆహారాన్ని అందించామన్నారు. అలాంటి అన్న క్యాంటీన్లను మూసివేయడం బాధాకరమన్నారు. రాయదుర్గంలో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ తొలగించి సచివాలయం ప్రారంభించడం ద్వారా సాధించిన ప్రగతి ఏంటో చెప్పాలని విప్ 'కాపు'ను నిలదీశారు.

శాంతియుత నిరసనకు అనుమతివ్వండి


తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

బొమ్మనహాల్ : సిఐటియు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ పిలుపు మేరకు రెండు రోజులపాటు నిర్వహించనున్న శాంతియుత ధర్నాకు అనుమతి ఇవ్వాలని పలువురు అంగన్‌వాడీలు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. శాంతియుతమైన నిరసనలో కణేకల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని దాదాపు వందమంది టీచర్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న ఐసిడిఎస్ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు

నార్పల : కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయంతోపాటు మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో వెలసిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

సరస్వతి విద్యామందిరానికి సౌండ్ సిస్టం వితరణ


సౌండ్ సిస్టంను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు : వివేకానంద విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.మంజునాథ పుట్టిన రోజు సందర్భంగా సంస్థల కరస్పాండెంట్ ఓంకారప్ప, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సరస్వతీ విద్యా మందిరం ప్రాథమిక పాఠశాలకు సౌండ్ బాక్స్ సిస్టం వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఓంకారప్ప, వివేకానంద విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఆర్.మంజునాథను ఘనంగా సన్మానించారు.

నేరాలు ఘోరాలు

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు

8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలు దొంగలించే ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను అనంతపురం సిసిఎస్, వన్‌టౌన్, ఉరవకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కడప జిల్లా మైలవరం మండలం బూబుసానిపల్లికి చెందిన గువ్వల పుల్లారెడ్డి, అదే జిల్లా పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుంప వెంకట రమణారెడ్డి స్నేహితులు. వీరికి ఉన్న చెడు అలవాట్ల కారణంగా అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలు దొంగలించడం మొదలు పెట్టారు. రద్దీ ప్రాంతాలో పార్క్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి తక్కువ ధరకు విక్రయించేవారు. ఇలా ఉరవకొండ, తాడిపత్రి అర్బన్, బళ్లారి, కర్నూలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీలు చేశారు. వీరిపై కడప జిల్లా యర్రగుంట్ల, అనంతపురం నాల్గవ పట్టణం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులలో పాత కేసులు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సిఐలు జి.టి నాయుడు, రెడ్డెప్ప ఆధ్వర్యంలో సిసిఎస్ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది తిరుమలేశ్, ప్రవీణ్, శ్రీనివాసులు, రంజిత్ మరియు ఉరవకొండ పోలీసులు బృందంగా ఏర్పడి నిందితులను అరెస్టు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

సిఎం రిలీఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పెద్దపప్పూరు : మండలంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం అందజేశారు. ముందుగా మండలంలోని ముచ్చుకోట గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైపి నాయకుల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని దేవుని ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డికి రూ.45వేలు, బొందలదిన్నె గ్రామానికి చెందిన నారాయణమ్మకు రూ.75 వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, ఎంపిపి రామిరెడ్డి, ఎంపిటిసి రామ్మూర్తిరెడ్డి, మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, యువజన నాయకుడు యోగేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్యాస్ సిలిండర్లపై దాడులు

గ్యాస్ సిలిండర్లను సీజ్ చేస్తున్న అధికారులు

అనంతపురం : అనంతపురం మండలంలోని కల్యాణదుర్గం రోడ్డులో ఉన్న బాలాజీ గ్యాస్ స్టవ్స్ సర్వీసింగ్ సెంటర్‌పై అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇళ్లకు వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడంతోపాటు చిన్న గ్యాస్ సిలిండర్లు రీ-ఫిల్లింగ్ చేయడం గుర్తించి జరిమానా విధించి కేసు నమోదు చేశారు. అలాగే మూడు డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ రామారావు, సిబ్బంది వాసు ప్రకాష్, గొల్ల రఘుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలను అరికట్టాలి

తహశీల్దార్ సునీతాబాయికి వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

పామిడి : ఓటరు జాబితాలో చోటు చేసుకున్న అవకతవకలను అరికట్టాలని టిడిపి పట్టణ కన్వీనర్ రామకృష్ణ కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్ సునీతాబాయికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో ఇంటి నెంబర్‌తో నమోదు చేసిన ఓటర్లు, శాశ్వతంగా ఊరు వెళ్లిన ఓటర్లు, వివాహం చేసుకుని వేరే ఊళ్లిన మహిళల ఓట్లు, డబల్ ఎంట్రీ ఓట్లు, మరణించిన వారి ఓటర్లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వడ్డే శివకుమార్, బొమ్మ మోహన్, సుంకప్ప, కుమార్, సూరి, శర్మాస్, శివ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

శింగనమల : వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో మండలంలోని సోదనపల్లి గ్రామంలో గర్భిణులకు సోమవారం సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ శ్రీనివాసరావు, సర్పంచి గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్మద, డిజిటల్ అసిస్టెంట్ హర్షవర్ధన్, శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు బి.రత్నమ్మ, ప్రశాంతి, సరస్వతి, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

శింగనమల : మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం రాత్రి నుంచి శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా పార్వతీ, పరమేశ్వరుల విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాలతో అర్చకులు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంతో దేవస్థాన పురోహితులు హరికృష్ణ స్వామి, అనిల్ స్వామి, శివమాలధారులు గురుస్వామి ఎరికలప్ప, ఆదినారాయణ, ఓబులేష్, రాజు, మారుతి, శ్రీకాంత్, హర్షవర్ధన్, అనిల్, అఖిల్, తరుణ్, బాలకృష్ణ, గోవర్ధన్, శివభక్తులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంతో ఎస్పీకి కృతజ్ఞతలు

ఎస్పీకి బొకే అందజేస్తున్న హరినాథ్‌రెడ్డి

అనంతపురం క్రైం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలకు పరిష్కారం చూపిన ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్‌కు విశ్రాంత ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు విశ్రాంత ఆర్టీవో హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మాజీ ఉద్యోగులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

బీమా సాయం అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, నాయకులు

రాయదుర్గం : ఇటీవల మృతిచెందిన పట్టణంలోని శాంతినగర్ 30వ వార్డుకు చెందిన సునీల్ కుటుంబానికి సోమవారం వైఎస్ఆర్ బీమా తక్షణసాయం అందజేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, వార్డు సభ్యులు గోరంట్ల ఉషా కలిసి మృతుడి భార్య జ్యోతికి రూ.1వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ శ్రీనివాసయాదవ్, వార్డు ఇన్‌ఛార్జి పొరాళు శివ, గోరంట్ల సత్యనారాయణ, గంగాధర్, నాయకులు నాగరాజు, ముస్తాక్, వైజాగ్ రవి, సచివాలయ సెక్రటరీ రాజేంద్ర, వాలంటీర్లు పాల్గొన్నారు.